సాక్షి శ్రీకాకుళం

గురువారం । 8 । మే । 2025



వినోదం.. విజ్ఞానం

వేసవి సెలవుల్లో చిన్నారులకు మెదడుకు పదును పెట్టేలా శిబిరాలు నిర్వహిస్తున్నారు. వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. - 10లో



సేవలకు కేరాఫ్ అడ్రస్..!

సేవా కార్యక్రమాలకు రెడ్‌క్రాస్ సంస్థ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. వందలాది రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలుస్తోంది. - 10లో



కూర్మనాథుని కల్యాణం..

ఆదికూర్మ క్షేత్రంలో శ్రీకూర్మంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవం జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. - 10లో

న్యూస్‌రీల్

పీడీఎస్ సరుకుల పంపిణీకి టెండర్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ శ్రీకాకుళం శాఖ పరిధిలో పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం (పీడీఎస్) ద్వారా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల రెండో దశ రవాణా నిమిత్తం ఈ-టెండర్ ప్రకటన జారీ అయ్యింది. ఈ మేరకు ఆ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2027 మార్చి 31 వరకు రవాణా కాంట్రాక్టర్లను నియమించనున్నట్లు తెలిపారు. జిల్లాలో జి.సిగడాం, ఆమదాలవలస, జలుమూరు, కొత్తూరు, మెళియాపుట్టి, శ్రీకాకుళం, టెక్కలి, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం, కంచిలి, సరుబుజ్జిలి, లావేరులో మండల స్థాయి గోదాముల నుంచి సంబంధిత చౌక ధరల దుకాణాలు, గ్రామ/వార్డు సచివాలయాల వరకు డోర్ డెలివరీ విధానాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ కార్యాలయంలో గానీ, సహాయ మేనేజర్(7732098637)ను గానీ సంప్రదించవచ్చని సూచించారు.

ఐసెట్‌కు 881 మంది హాజరు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్ -2025 ప్రవేశ పరీక్ష జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహించారు. చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్కలిలోని ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్ ఆన్‌లైన్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 980 మంది దరఖాస్తు చేసుకోగా 881 మంది హాజరయ్యారు. 99 మంది గైర్హాజరయ్యారు.



విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



రైల్వేస్టేషన్ ఆవరణలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు, అధికారులు



పౌరుల భాగస్వామ్యంతో.. మాక్‌డ్రిల్ సక్సెస్

భారత్-పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతల వేళ ఆపరేషన్ అభ్యాస్ పేరిట బుధవారం శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ ఆవరణలో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లోకి చొరబడిన ఉగ్రవాదులను పట్టుకోవడం, యుద్ధంలో గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయాలు అందించడం, బాంబు పేలుడు, క్షతగాత్రుల తరలింపు తదితర అంశాలను కళ్లకు కట్టినట్లు చేసి చూపించారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, ఆర్డీవో సాయి ప్రత్యూష పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపకాధికారి జె.మోహన్‌రావు, శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ సర్కిల్ అధికారి ఎస్.కాంతారావు, ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, స్థానిక అగ్నిమాపక అధికారి కె.అప్పారావు, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. - ఆమదాలవలస

● జైహింద్



ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. -ఎచ్చెర్ల క్యాంపస్



మాక్‌డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రులను తరలిస్తూ..

తీరంలో అలెర్ట్

- భారత్ - పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో మెరైన్ పోలీసులు అప్రమత్తం
- తీర ప్రాంత గ్రామాల్లో విస్తృత అవగాహన
- అనుమానితులపై సమాచారం ఇవ్వాలని సూచన



మత్స్యలేశంలో సముద్ర తీరం

సమాచారం ఇవ్వాలి

తీరప్రాంతంలో అజ్ఞాత వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి. టోల్ ఫ్రీ నంబర్లు **1093, 100,** స్థానిక పోలీస్‌స్టేషన్, ఎస్సైలకు సమాచారం ఇవ్వాలి. సాగర మిత్రలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజా భాగస్వామ్యంతోనే ఉగ్రముప్పు ఎదుర్కోగలం.

– జి.హరికృష్ణరావు, ఎస్సై, కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్-పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో తీర ప్రాంతం గుండా అనుమానితులు చొరబడకుండా కోస్టల్ సెక్యూరిటీ స్టేషన్ పోలీసులు(మెరైన్) ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక పోలీసులతో కలిసి జిల్లాలోని తీర ప్రాంత గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. సముద్ర తీరం గుండా గ్రామాల్లోకి ఉగ్రవాదులు చొరబడకుండా జనాలను అప్రమత్తం చేస్తున్నారు.

జిల్లాలో విశాల తీరం..

శ్రీకాకుళం జిల్లాలో 193 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం విస్తరించింది ఉంది. రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, గార, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లోని 150పైగా గ్రామాలు ఉన్నాయి. వారం రోజులుగా ఆయా గ్రామాల్లోకి పోలీసులు వెళ్లి ఉగ్రముప్పును ఏ విధంగా ఎదుర్కోవాలో ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

మాక్‌డ్రిల్ ..

పోలీసులు, మెరైన్ సిబ్బంది మారువేషాల్లో బోట్లపై వచ్చి తీర ప్రాంత గ్రామాల్లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ఉగ్రవాదులతో ఎలా పోరాడాలో, ఎలా రక్షణ పొందాలో అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే సాగర్ కవచ్ (కోస్టల్ ఎక్సర్ సైజ్) వంటి విన్యాసాలు నిర్వహించారు.

గతంలో ఇలా..

గతంలో శ్రీకాకుళం తీర ప్రాంతంలో తీవ్రవాదులు సముద్ర మార్గంలో వచ్చిన ఘటనలు లేకపోయినప్పటికీ.. తుపానులు, మార్గం గుర్తించకపోవటం వంటి సమయాల్లో శ్రీలంక, బంగ్లాదేశ్ మత్స్యకారులు తీరానికి చేరిన ఘటనలున్నాయి. బంగ్లాదేశ్, శ్రీలంక జాలార్లు బుడగట్లపాలెం, డి.మత్స్యలేశం వంటి తీరాలకు చేరిన సమయంలో అప్పట్లో వీరిపై కేసులు నమోదు చేసిన పోలీసులు పొరపాటున తీరానికి వచ్చినట్లు దర్యాప్తులో తేలటంతో నిర్దోషులుగా విడుదల చేసి వారి దేశానికి పంపించేశారు.

గ్రంథాలయ స్థలంపై.. పచ్చ గద్దలు



జిల్లా కేంద్ర గ్రంథాలయం

- పక్కా భవనాలను కూల్చేసి కొత్తవి నిర్మిస్తామంటూ ఎత్తులు
- ప్రైవేటు వ్యక్తులతో అభివృద్ధి చేస్తామంటూ లీకులు
- కాగిత పూర్వకంగా లేకుండా వ్యవహారాలు
- కేంద్ర మంత్రి చెప్పారంటూ అధికారుల కొలతలు
- జరుగుతున్న పరిణామాలపై ప్రజా సంఘాల నేతలు, పాఠకుల ఆందోళన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఎంతో ఘన చరిత గల జిల్లా కేంద్ర గ్రంథాలయమది. నగరం నడిబొడ్డున ఎకరా స్థలంలో మూడు భవనాలు ఉన్నాయి. అందులో రెండు భవనాలు చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఇప్పుడా భవనాల్లో బుక్స్ రీడింగ్, పేపర్ రీడింగ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ తదితర కార్యకలాపాలు సాగుతున్నాయి. ఇప్పుడా భవనాలను కూల్చేసి కొత్త భవనం నిర్మిస్తామంటూ పాలకులు సిద్ధమవుతున్నారు. అనుకున్నదే తడవుగా ప్రస్తుతం నడుస్తున్న గ్రంథాలయాన్ని యుద్ధ ప్రాతిపదికన ఖాళీ చేసేసి అప్పగించాలని అధికారుల ద్వారా ఆదేశించారు. దీంట్లో ఎక్కడా కాగితాలపై ఉత్తర్వుల్లేవు. నోటి మాటతోనే అంతా కానిచ్చేస్తున్నారు. ఇప్పుడిదే అనుమానాలకు తావిస్తోంది. దీంట్లో ఏదో మతలబు ఉందని, గ్రంథాలయం స్థలాన్ని కొట్టేసేందుకు ఎత్తుగడగా కనిపిస్తోందని, ప్రతి విషయంలో ప్రైవేటుపై మోజు చూపుతున్న కూటమి ప్రభుత్వం తీరు ఆందోళన కలిగిస్తోందని పాఠకులు, నిరుద్యోగులు, అధికారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ప్రజా సంఘాలు, వామపక్షాలు, ఉపాధ్యాయ సంఘాలు, సాహితీ సంస్థలకు చెందిన నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి వ్యతిరేకతను తెలియజేశారు.

ఉత్తర్వులు లేకుండా..

ఏ అభివృద్ధి చేయాలనుకున్నా దానికొక ప్రతిపాదన ఉంటుంది. పాలనాపరమైన అనుమతులతో నిధులు మంజూరు చేసినట్టుగా ఉత్తర్వులు వస్తాయి. కానీ, ఎకరా స్థలంలో ఉన్న జిల్లా గ్రంథాలయాన్ని కూల్చేసి కొత్త భవనం నిర్మిస్తామనడమే కాకుండా యుద్ధ ప్రాతిపదికన ఖాళీ చేసేయండని చెబుతున్నారే తప్ప.. దానికి సంబంధించిన కాగితాలపై ప్రొసీడింగ్స్ ఇవ్వడం లేదు. అర్జ్ కళాశాలలో రూమ్‌లిస్తున్నాం.. అర్జంట్‌గా ఖాళీ చేసేయండని మాత్రమే చెప్పారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదేశాలని చెప్పి అటు అధికారులు, ఇటు కేంద్రమంత్రి అసిస్టెంట్లు వెళ్లి అక్కడ కొలతలు వేసి హడావుడి కూడా చేసేశారు. ఇప్పుడిదే పలు అనుమానాలకు తావిస్తోంది.



కేంద్ర గ్రంథాలయ భవనాలు

పీపీపీ విధానంతో ధారాదత్తం..

ఇప్పటికే కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే ప్రయత్నం చేస్తోంది. ప్రైవేటు వ్యక్తులతో అభివృద్ధి చేసి, వాటి నిర్వహణ, ఆదాయం పొందే అధికారాన్ని ఆ వ్యక్తులకే అప్పగించాలని చూస్తోంది. ఇప్పటికే నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్, పొట్టి శ్రీరాముల మార్కెట్, బాపూజీ కళామందిర్, మరి కొన్ని కార్పొరేషన్ స్థలాలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి, అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేసింది. ఈ నేపథ్యంలోనే జిల్లా గ్రంథాలయ భవనాలను కూల్చేసి, ప్రైవేటు వ్యక్తులతో కొత్తగా నిర్మించేందుకు సిద్ధమవుతుండటంతో ప్రజల్లో ఆందోళన, అనుమానం నెలకున్నాయి.

బాగున్న భవనాలను కూల్చేస్తారా?

జిల్లా గ్రంథాలయం ప్రాంగణంలో మూడు భవనాలు ఉన్నాయి. అందులో రెండు భవనాలు మంచి కండిషన్‌లో ఉన్నాయి. ఒక భవనం మాత్రం అంతగా బాగోలేదు. ఒకవేళ అభివృద్ధి చేయాలనుకుంటే ఆ పాత భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించొచ్చు. అంతేకాదు.. ప్రస్తుతం ఉన్న గ్రంథాలయం భవనం వెనక ఖాళీ స్థలం ఉంది. దాంట్లో కూడా కొత్త భవనాలు నిర్మించవచ్చు. ఆ దిశగా ఆలోచించకుండా ఏకంగా జిల్లా గ్రంథాలయ భవనాలన్నీ కూల్చేసి కొత్త భవనాలు నిర్మిస్తామని..అవి కూడా ప్రైవేటు వ్యక్తుల నిధులతో చేస్తామని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. ఎవరి ప్రయోజనాల కోసం ప్రస్తుత భవనాలు కూలగొట్టి, కొత్తవి కట్టేందుకు సిద్ధమవుతున్నారో చెప్పాలని పౌర సమాజ పెద్దలు ప్రశ్నిస్తున్నారు.

గత అనుభవాలతో ఆందోళన..

గతంలో విశాఖపట్టణంలోని జిల్లా గ్రంథాలయ సంస్థను కూడా అప్పటి మంత్రి (2014-19 మధ్య సమయంలో)గంటా శ్రీనివాసరావు అభివృద్ధి పేరుతో లైబ్రరీ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు చూశారు. దీన్ని విశ్రాంత గ్రంథాలయ అధికారులు అడ్డుకున్నారు. అయినప్పటికీ గ్రంథాలయ స్థలాన్ని తన గుప్పెట్లోనే పెట్టుకున్నారు. నేటికీ ఈ స్థలం అలాగే ఉంది. ఇపుడు జిల్లాలోని గ్రంథాలయ స్థలంపై కూడా నేతలు కన్ను పడటంతో సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా కొత్త భవనం ప్రతిపాదన రావడంతో ప్రజా సంఘాలు, విశ్రాంత గ్రంథాలయ అసోసియేషన్ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్థలాన్ని కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

చిత్తశుద్ధి ఉంటే...

గ్రంథాలయానికి ప్రస్తుతం నిధులు, సిబ్బంది కొరత ఉంది. పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థులకు పుస్తకాలు సమకూర్చలేని దుస్థితి నెలకొంది. నిత్యం జిల్లా గ్రంథాలయానికి 350 నుంచి 400 మంది వరకూ పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థులు వస్తుంటారు. వీరిందరికీ సరైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. వాటిపై దృష్టిసారించకుండా గ్రంథాలయాన్ని నెలాఖరు నాటికి ఖాళీ చేయాలని ఉన్నతాధికారులు డెడ్‌లైన్ పెట్టడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

అడ్డగోలు ఒప్పందం రద్దు చేయాలి



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం కొందరికే లాభం చేకూరేలా యాక్సిస్ ఎనర్జీ వెంచర్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థతో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందం అడ్డగోలుగా ఉందని, దీనిని వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. బుధవారం నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలు పేరుతో ప్రజలపై అదనపు భారం మోపేలా ఈ ఒప్పందం ఉందన్నారు. ఇప్పటికే పెరిగిన ట్రూ-అప్ చార్జీలు, ఏపీపీపీసీఏ వంటి చార్జీలతో సామాన్యులు తీవ్రంగా నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తిరస్కరించిన ఈ ఒప్పందాన్ని ఇప్పుడు పునరుద్ధరించడం శోచనీయమన్నారు. దేశ వ్యాప్తంగా సోలార్ విద్యుత్ ధరలు పడిపోతున్నా, 25 ఏళ్ల పాటు యూనిట్‌కు రూ.4.60 చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.14 వేల కోట్లకుపైగా అదనపు భారం పడనుందని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, అన్ని రకాల అదనపు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు డీఎస్సీ క్రాష్‌కోర్సు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఎస్సీలో భాగంగా జిల్లాలో దివ్యాంగ అభ్యర్థుల కోసం విజయవాడలో క్రాష్ కోర్సు శిక్షణ నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు కె.కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దృష్టిలోపం, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ తదితర దివ్యాంగులైన ఎస్‌జీటీ పోస్టుల అభ్యర్థులు ఈ నెల 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఎండీఎఫ్‌సి.ఏపీఈఎఫ్ఈఎఫ్ఎస్ఎస్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. కనీసం 40 శాతం వికలాంగత్వం ఉన్నవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. టెట్ స్కోర్ ఆధారంగా ఎంపిక జరగనుందని, ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్, భోజనం, వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తామని తెలిపారు.

దారుణం

సిక్కోలు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. బుధవారం జిల్లాలో వేర్వేరు చోట్ల రెండు దారుణ హత్య ఘటనలు చోటుచేసుకున్నాయి. పార్కింగ్ స్థలం విషయంలో తలెత్తిన గొడవ ఓ వృద్ధుడి ప్రాణాలను బలిగొనగా.. అనుమానం పెనుభూతమై భార్యను భర్త దారుణంగా హత్య చేశాడు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

- జిల్లాలో వేర్వేరు చోట్ల రెండు హత్యలు
- వృద్ధుడు, మహిళ మృతి





హత్యకు గురైన నర్సింగరావు (ఇన్‌సెట్లో) నర్సింగరావు(ఫైల్)

ప్రాణం తీసిన పార్కింగ్ గొడవ

శ్రీకాకుళం రూరల్ : పార్కింగ్ స్థలం విషయమై జరిగిన గొడవ ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. మద్యం మత్తులో ఓ వ్యక్తి తన ఎదురింట్లో నివాసముంటున్న వృద్ధుడిని దారుణంగా హత్య చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలి గ్రామంలో నివాసముంటున్న కన్నం నర్సింగరావు (58) స్థానికంగా వ్యవసాయ పనులు చేస్తూ డిటర్జెంట్ సబ్బులు వంటి చిన్న చిన్న వస్తువులను గ్రామాల్లో అమ్ముతుండేవాడు. తన ఇంటికి ఎదురుగా ఉంటున్న ఇప్పిలి రమణ అనే వ్యక్తితో ద్విచక్ర వాహనం పార్కింగ్ స్థలం విషయంలో మంగళవారం సాయంత్రం చిన్నపాటి తగాదా జరిగింది. అది రాత్రి వరకూ కొనసాగింది. విషయం తెలుసుకున్న నర్సింగరావు చిన్నకుమారుడు తారకేశ్వరరావు ఇంటికి వచ్చి ఇద్దరికి నచ్చజెప్పి పంపించేశాడు. రాత్రి 9గంటల సమయంలో నర్సింగరావు తన ఇంటి మేడపైకి వెళ్లి నిద్రపోయాడు. కోపోద్రిక్తుడైన రమణ పూటుగా మద్యం సేవించి అర్ధరాత్రి తర్వాత ఓ పదునైన ఆయుధంతో నర్సింగరావు తల, చెవి భాగాల్లో పోట్లు పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఉదయం లేచి చూసేసరికి నర్సింగరావు రక్తపుమడుగుల్లో విగతజీవిగా ఉండటంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సింగరావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ప్రసాదరావు సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా మణిపూర్‌లో పనిచేస్తుండగా, చిన్న కుమారుడు తారకేశ్వరరావు నరసన్నపేట మండలం ఉర్లాంలోని రైల్వేశాఖలో ట్రాక్‌మేన్‌గా పనిచేస్తున్నాడు.

క్లూస్‌టీం పరిశీలన..

విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు, క్లూస్‌టీం సిబ్బంది బుధవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. దాడికి పాల్పడిన రమణను రూరల్ పోలీసులు గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. టౌన్ సీఐ కె.పైడపునాయుడు, రూరల్ ఎస్ఐ కె.రాము ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

అన్నీ తానై చూసుకున్నా..

ఇప్పిలి రమణ వీరావల్‌లో చేపల వేటకు వెళ్లేవాడు. ప్రస్తుతం గ్రామంలోనే ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. పదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ పెళ్లి కూడా నర్సింగరావే దగ్గరుండి చేయించాడని గ్రామస్తులు అంటున్నారు. రమణకు భార్యతో మనస్పర్థలు రావడంతో నర్సింగరావు ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో చిన్న రేకుల షెడ్డు వేసుకొని ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. స్థానికులు ఎవరో ఒకరు భోజనం పెడితే తినేవాడు. ఎవ్వరూ భోజనం పెట్టని రోజు మాత్రం ఎదురుగా ఉన్న నర్సింగరావే స్వయంగా భోజనం పెట్టేవాడని గ్రామస్తులు అంటున్నారు. అలాంటిది ఆయన్నే హత్య చేయడం చర్చనీయాంశంగా మారింది.





రక్తపుమడుగులో లక్ష్మి మృతదేహం (ఇన్‌సెట్లో) లక్ష్మి (ఫైల్)

అంతుచూసిన అనుమానం..!

టెక్కలి: కోటబొమ్మాళిలో బ్యూటీపార్లర్, లేడీస్ కార్నర్ షాపు నిర్వహిస్తున్న మహిళ తన భర్త చేతిలో దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. సంతబొమ్మాళి మండలం నర్సాపురం గ్రామానికి చెందిన నర్సిపురం లక్ష్మి (30) తన భర్త తిరుపతిరావుతో కలిసి కోటబొమ్మాళి విద్యుత్‌నగర్‌లో నివాసముంటోంది. లక్ష్మి స్థానికంగా హర్షిణి పేరుతో బ్యూటీ పార్లర్, లేడీస్ కార్నర్ నిర్వహిస్తోంది. తిరుపతిరావు కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. భార్యపై అనుమానంతో ఇద్దరికీ తరచూ గొడవలు జరుగుతుండేవి. గతంలో పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన దాఖలాలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో భార్య లక్ష్మిని భర్త తిరుపతిరావు దారుణంగా గొంతు కోశాడు. దీంతో లక్ష్మి తీవ్ర రక్తస్రావంతో విగతజీవిగా పడిపోయింది. అనంతరం తిరుపతిరావు మద్యం షాపునకు వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న కోటబొమ్మాళి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రక్తపు మడుగులో ఉన్న లక్ష్మిని పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు మద్యం షాపు వద్ద ఉన్న తిరుపతిరావును అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భార్యపై అనుమానంతోనే ఈ హత్య చేసినట్లు స్థానికులు భావిస్తున్నారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీం చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతురాలికి భర్తతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇన్‌చార్జి సీఐ విజయకుమార్, ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలంలో దర్యాప్తు నిర్వహించి కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నాటుసారా కేసులో మహిళకు జైలు శిక్ష

పలాస: వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లి గ్రామానికి చెందిన చొక్కరి నారాయణమ్మకు నాటుసారా కేసులో 12 నెలల జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి బుధవారం తీర్పునిచ్చారు. ఈ విషయాన్ని పలాస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021 నవంబర్ 29న అక్రమంగా 6.5 లీటర్ల నాటుసారా కలిగి ఉండడంతో అప్పటి ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణారావు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రమేష్ వాదించారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో తుది తీర్పు ఇచ్చారని, ఈ మేరకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని తెలిపారు.

రైలులో మరిచిన బంగారం లభ్యం



హ్యాండ్ బ్యాగ్ అందిస్తున్న హెచ్‌సీ సోమేశ్వరరావు

కాశీబుగ్గ: రైలులో రెండున్నర తులాల బంగారం మరిచిపోయినా తిరిగి జీఆర్పీ పోలీసుల సహకారంతో దొరికిన ఘటన పలాస రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ డెక్కన్ నాంపల్లి నుంచి కటక్ జంక్షన్‌కు వస్తున్న ప్రత్యేక ఫేర్ రైలు (రైలు నంబర్ 07165)లో ఒక ప్రయాణికురాలు ప్రయాణం చేస్తూ శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో దిగిపోయింది. అయితే తాను కూర్చున్న ఏ-2 కోచ్‌లో 11వ నంబర్ బెర్త్ తలగడ కింద తన హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయింది. శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ జీఆర్పీ సెంట్రీ పీసీ శశికుమార్‌కు ఆమె ఫిర్యాదు చేయడంతో పలాస జీఆర్పీ వారికి తెలియజేశారు. దీంతో అందుబాటులో ఉన్న హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వరరావు, ఉమెన్ కానిస్టేబుల్స్ భానుమతి, లత, అనితలు తక్షణమే ట్రైన్ సమయానికి వెళ్లి చెక్ చేయగా హ్యాండ్ బ్యాగ్ దొరికింది. అందులో బంగారు ఆభరణాలు సుమారుగా రెండున్నర తులాలు ఉండగా, వాటిని స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు.

పండగపూట విషాదం



గౌతమ్ రాజకుమార్ మృతదేహం

రణస్థలం: మండలంలోని అర్జునవలసలో అసిరితల్లి ఉత్సవాల సమయంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన వద్దాది గౌతమ్ రాజకుమార్(15) బావిలో పడి మృతి చెందాడు. స్థానికులు, జేఆర్‌పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అర్జునవలసలో అసిరితల్లి పండుగ నేపథ్యంలో తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామంలోని నాన్నమ్మ బొత్స సామాలమ్మ ఇంటికి గౌతమ్ వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్‌తో పాటు గ్రామానికి దూరంగా వెల్పురాయి సమీపంలో ఉన్న బావి దగ్గరకు స్నానానికి వెళ్లాడు. పక్కన ఉన్న దుర్గాప్రసాద్ నీకు ఈత వచ్చా అని అడగగా వచ్చని చెప్పి బావిలో దిగాడు. ఒక రెండు సార్లు మునిగి, తేలి అనంతరం పూర్తిగా గౌతమ్ మునిగిపోవడంతో పక్కనే ఉన్న దుర్గా ప్రసాద్‌కు భయం వేసి గ్రామంలోకి పరుగెత్తుకుని వచ్చాడు. జరిగిన విషయం చెప్పగా పలువురు గ్రామస్తులు బావిలో దిగి బాలుడిని వెతికినా దొరకలేదు. జేఆర్‌పురం పోలీసులకు సమాచారం ఇవ్వగా వాళ్లు వచ్చి మరో ముగ్గురు ఈతగాళ్లని బావిలో దించారు. దీంతో సాయంత్రం 4 గంటల సమయంలో మునిగిపోయి ఉన్న గౌతమ్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఉపాధి కోసం విశాఖపట్నంలోని సింహాద్రిపురంలో మృతుడు తండ్రి లక్ష్మణరావు ఉంటున్నాడు. ఆయనకు కుమారుడు మృతుడు గౌతమ్, కుమార్తె ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినోదం.. విజ్ఞానం







సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం

- వేసవి సెలవుల్లో మెదడుకు పదును
- విద్యార్థులకు వివిధ రకాల శిక్షణలు

టెక్కలి: వేసవి సెలవుల్లో కేవలం ఆటపాటలే కాకుండా వ్యక్తిత్వ వికాసం, శారీరక, మానసిక వికాసం మెరుగుపడేవిధంగా డివిజన్ కేంద్రమైన టెక్కలిలో పలువురు నిర్వాహకులు శిక్షణ అందజేస్తున్నారు. రామాయణ, మహాభారతం, పురాణాలతో పాటు మూఢ నమ్మకాలపై చైతన్యవంతం చేస్తున్నారు. మెదడుకు పదును పెట్టేవిధంగా చదరంగం, శారీరక, మానసిక ధృడత్వం కలిగే విధంగా మార్షల్ ఆర్ట్స్ ఇలా ఒకటేమిటి చిత్రలేఖనం, ఆట పాటలు, క్విజ్ తదితర శిక్షణ కార్యక్రమాలతో చిన్నారులను తీర్చిదిద్దుతున్నారు.

● బాల వికాస్

టెక్కలిలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాల వికాస్ పేరుతో చిన్నారులకు వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారు. వాటిలో రామాయణ, మహాభారతంతో పాటు పురాణాలు, ఇతిహాసాలు, పెద్దలను గౌరవించడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పురాణ గాథలతో క్విజ్ పోటీలు, కోలాటం వంటి ఆటపాటలతో ఆహ్లాదపరుస్తున్నారు.

● చైతన్యవంతం

విద్యార్థి దశ నుంచి మూఢ నమ్మకాలపై చైతన్యం కలిగించేందుకు పట్టణానికి చెందిన ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. చిత్రలేఖనం, చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించే విధంగా వైద్య శిబిరాలను అందజేస్తున్నారు.



చదరంగంలో శిక్షణ

● మెదడుకు మేత

వేసవి సెలవుల్లో చిన్నారుల మెదడుకు పదును పెట్టే విధంగా పట్టణంలో చదరంగం శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. వీటితో పాటు మార్షల్ ఆర్ట్స్ తరగతులను చేపడుతున్నారు. మరోవైపు శాఖా గ్రంథాలయంలో ప్రత్యేకంగా వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ వేసవిలో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహణ ఎంతగానో ఆకట్టుకుంటోంది.

ఏదో ఒక అంశం నేర్చుకోవాలి



వేసవి సెలవుల్లో ఆటపాటలే కాకుండా ఏదో ఒక ప్రత్యేక అంశాన్ని విద్యార్థులు నేర్చుకుని తద్వారా వ్యక్తిత్వ వికాసం మెరుగు పరుచుకోవాలి. దీనికోసం నిర్వహిస్తున్న శిక్షణ తరగతులపై ఆసక్తి చూపాలి.
– బి.అన్నపూర్ణమ్మ, సత్యసాయి సేవా సమితి, టెక్కలి.

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం



ఈ వేసవిలో ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యంలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. దీనిలో ప్రధానంగా మూఢ నమ్మకాలపై మరింత చైతన్యవంతం చేస్తున్నాం. అలాగే శారీరక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.
– చిలుకు కృష్ణారావు, ప్రజా చైతన్య కళా సమితి ప్రతినిధి, టెక్కలి



మూఢ నమ్మకాలపై చైతన్యం కలిగిస్తున్న నిర్వాహకులు

పెండింగ్ ప్రాజెక్టులు తక్షణమే పూర్తి చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో మూడింట రెండొంతుల వ్యవసాయం వర్షాధారంగా ఉంటుందన్నారు. అయితే సమయానికి వర్షాలు లేకపోవడంతో సాగు ముందుకు సాగక ప్రజలు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సహజ సిద్ధమైన నీటి వనరులు పుష్కలంగా ఉన్నా, ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన వినియోగంలోకి రావట్లేదని ధ్వజమెత్తారు. వంశధార, నాగావళి, మహేంద్ర తనయ, బహుదా వంటి నదుల నుంచి నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోందని వాపోయారు. ప్రభుత్వాలు ప్రాజెక్టులు నిర్మిస్తే నీరు వృథా అవ్వకుండా సకాలంలో రైతులకు అందించవచ్చన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

ధర్మవరం చెరువు ఆక్రమణలు తొలగించి మినీ రిజర్వాయర్‌గా చేయాలని డిమాండ్ చేశారు. బుడుమూరు నారాయణ సాగరంను మినీ రిజర్వాయర్‌గా చేయాలని, మందస చేపిగెడ్డ నీటిని గోపాల సాగరానికి మళ్లించాలని సూచించారు. తండ్యాం ఎత్తిపోతలు పథకం పూర్తి చేయాలని, పైడిగాం ప్రాజెక్టును ఆధునీకరించాలని విన్నవించారు. ఇప్పటికే ఉన్న కొన్ని ప్రాజెక్టులు మరమ్మతులకు గురై నీరు నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయాయని, కాలువల్లో పూడికలు పేరుకుపోవడం, గుర్రపు డెక్కతో నిండిపోవడంతో సాగునీరు ప్రవహించడం లేదన్నారు. నారాయణపురం వంటి పురాతనమైన ప్రాజెక్టులు కూడా రైతులకు సాగునీరివ్వలేని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్లో జిల్లాకు తగినన్ని నిధులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులకు సంవత్సరానికి కనీసం రూ.2 వేల కోట్లు ఇచ్చి పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావు, కె.కొండయ్య, బి.వాసు, ఎం.అజయ్, ముద్దాడ రమణ, రూప్ప ఆదినారాయణ, జె.కృష్ణారావు, అల్లు సూర్యనారాయణ, యాన్ రంగారావు, నీలం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం



చదును చేసిన శ్మశానవాటిక స్థలం

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ఆక్రమణలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. మండలంలోని బూరగాం పంచాయతీ రామేశ్వరం గ్రామంలో ఏకంగా శ్మశానవాటిక సర్వే నంబర్ కలిగిన ప్రభుత్వ స్థలంపై కొంత మంది అధికార పార్టీ కార్యకర్తల కన్ను పడింది. దీంతో ఆ స్థలాన్ని చదును చేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే స్థలంలో గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు ఇంటి స్థలాలు అందజేసేందుకు సిద్ధం కాగా, అప్పట్లో ఈ స్థలం శ్మశానవాటిక సర్వే నంబర్‌లో ఉందనే కారణంతో రెవెన్యూ అధికారులు ఎటువంటి స్థలాలు అందజేయలేదు. ఇప్పుడు అదే సర్వే నంబర్ 523 స్థలంలో స్థలాన్ని చదును చేసి నిర్మాణాలకు సిద్ధమవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో దశాబ్దాల క్రితం కొంత మంది పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల సాకుతో ఇప్పుడు అదే స్థలాన్ని కాజేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జి వీఆర్వో జోగారావు వద్ద ప్రస్తావించగా సర్వే నంబర్ 523లో గ్రామానికి చెందిన కొంతమంది చదును చేయగా, దానిని అడ్డుకుని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవ్వకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లు

రణస్థలం: మండలంలోని పిషిని గ్రామ సమీపంలో దమరసింగి శంకరరావు అనే వ్యక్తి అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సాయంత్రం 7 గంటల సమయంలో గ్రామ శివారులో 24 మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా పట్టుకుని జేఆర్‌పురం పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మన్యం వీరుడికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : విప్లవ వీరుడు, మన్యం ప్రజల ఆరాధ్యుడు అల్లూరి సీతారామరాజు 104వ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి పోరాట స్ఫూర్తిని కొనియాడారు. అలాగే కలెక్టర్ కార్యాలయంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌వో వేంకటేశ్వరరావులు అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

మాతాశిశు మరణాల రేటు తగ్గాలి



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.కె.అనిత ఆధ్వర్యంలో జిల్లాలో మాతాశిశు మరణాలపై బుధవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పోలాకి, అక్కులపేట, గుత్తావల్లి, పాజుల్ బాగ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహిళల ధర్నా



ధర్నా చేస్తున్న హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రజలు

పాతపట్నం: మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం షాపు వద్ద హౌసింగ్ బోర్డు కాలనీ వాసులు, మహిళలు బుధవారం రెండో రోజు ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తక్షణమే ఇక్కడి నుంచి మద్యం దుకాణాన్ని మార్చాలని, లేనిచో ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. జనవాసాల మధ్య మద్యం దుకాణం పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

కూర్మనాథుని కల్యాణం చూతము రారండీ..!



శ్రీకూర్మనాథాలయం

- ఆదికూర్మ క్షేత్రానికి కల్యాణ వైభవం
- నేడు స్వామివారి కల్యాణోత్సవం

గార: విష్ణువు దశావతారాల్లో దుష్టశిక్షణ లేని సాత్విక అనుగ్రహం కలిగించే ఏకైక అవతారం కూర్మావతారం. బలరాముడి ఆదేశానుసారం ప్రపంచంలోనే ఏకైక కూర్మావతారం కలిగిన దివ్యక్షేత్రం శ్రీకూర్మం. దివ్యక్షేత్రాలన్నింటిలోనూ అత్యంత ప్రాచీనమైనది కావడంతో దీనిని ఆది కూర్మ క్షేత్రమని అంటారు. ఈ క్షేత్రంలో వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినాన గురువారం వార్షిక కల్యాణం జరగనుంది. రాత్రి 10 గంటలకు తిరవీధి ప్రారంభమై మత్స్యనారాయణ ఆలయం జంక్షన్ వద్ద ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుంది. గత తొమ్మిది రోజులుగా పందిరి రాట నుంచి కొట్నం దంపు వరకు పలు కార్యక్రమాలను వైదికులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వార్షిక కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ముగ్గురు ఆచార్యులు సందర్శించిన ఏకైక క్షేత్రం

ఈ క్షేత్రాన్ని ఎనిమిదో శతాబ్దంలో ఆదిశంకరాచార్యులు సందర్శించి స్వామివారికి సుదర్శన సాలగ్రామాన్ని సమర్పించారు. 11వ శతాబ్దంలో రామానుజాచార్యులు సందర్శనలో గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాలను సమర్పించారు. 13వ శతాబ్దంలో మధ్వాచార్యుల శిష్యులైన శ్రీనరహరితీర్థులు క్షేత్రాన్ని సందర్శించి సీత, రామలక్ష్మణ ఉత్సవమూర్తులను బహూకరించారు. 1512వ సంవత్సరంలో చైతన్య మహాప్రభువులు క్షేత్రాన్ని సందర్శించారు. చైతన్య మహా ప్రభువుల పాదముద్రలు ఆలయాన పశ్చిమ భాగంలో దర్శించవచ్చు. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సాంప్రదాయ మతాచార్యులు సందర్శించిన ఏకైక క్షేత్రంగా కూర్మనాథాలయం విరాజిల్లుతోంది. అదేవిధంగా లవకుశులు, దుర్వాసుడు, శ్రీకృష్ణదేవరాయుల వంటివారు ఈ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ క్షేత్రంలో అన్ని మతాల వారికి గర్భగుడి ప్రవేశం ఉంది. ఈవిధమైన సౌకర్యం ఉన్న ఏకైక క్షేత్రం ఇదే కావడం విశేషం. నిత్యం అభిషేకాలు జరిగే అరుదైన వైష్ణవ క్షేత్రమిది.



తులసీ దళ అలంకరణలో శ్రీకూర్మనాథుడు

కూర్మనాథాలయ ఆవిర్భావం

వైవస్వత మన్వంతరం 28వ మహాయుగంలోని కృతయుగం (సుమారు 20 లక్షల సంవత్సరములు క్రితం)లో శాలిహుండాన్ని రాజధానిగా చేసుకొని ఈ ప్రాంతాన్ని శ్వేత చక్రవర్తి పరిపాలించారు. ఆ సమయంలోనే శ్రీకూర్మనాథాలయం నిర్మాణాలు జరిగాయని పురాణాలు పేర్కొంటున్నాయి. విష్ణువు కూర్మం (తాబేలు) అవతారంలో స్వయంభువుగా ఉండడం, బ్రహ్మ ఈ ఆలయాన్ని ప్రతిష్టించడం, ప్రతిరోజూ రాత్రి సమయాల్లో దేవతలు దర్శనం జరుగుతుందని నమ్మకం వంటి విశేషాలు ఈ ఆలయంలో చాలానే ఉన్నాయి. స్వామివారు ఇక్కడ కొలువుండడంతో లక్ష్మీదేవి సుదర్శన చక్రం ద్వారా ఏర్పడిన శ్వేతపుష్కరిణిలో గరుడ వాహనంపై పద్మాసన స్థితిలో ఆవిర్భవించిందని చెబుతుంటారు. దుర్గాదేవి రాత్రివేళ గర్భగుడి చుట్టూ ఉన్న బేడా మంటపంపై స్వామిచుట్టూ ప్రదక్షిణ చేస్తూ నృత్యం చేస్తుందని, ఈ నాట్య ధ్వనులు కొన్నేళ్ల క్రితం వరకు ఆలయం నుంచి వినిపించేవని స్థానికులు చెబుతుంటారు.

నర్సింగ్ కాలేజీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



కిశోర్(ఫైల్)

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న నర్సింగ్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ విధానంపై పనిచేస్తున్న కిశోర్ (27) విజయవాడలో బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సింగ్ విద్యార్థులకు సంబంధించి మార్కులను రాష్ట్ర కార్యాలయానికి ఇక్కడ పనిచేస్తున్న ఐదుగురు రెగ్యులర్ ఉద్యోగుల్లో ఎవరో ఒకరితో పంపించాల్సి ఉంది. అయితే ప్రిన్సిపాల్ ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ అజయ్ ఈ నిబంధన విస్మరించి లాబ్ సబార్డినేటర్‌గా పనిచేస్తున్న కిశోర్ అనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని మంగళవారం మధ్యాహ్నం విజయవాడ పంపించినట్లు తెలిసింది. ఈ సమయంలో రిలీవ్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉన్నా అందజేయలేదు. బుధవారం పని ముగించుకొని తిరిగి వస్తుండగా కిశోర్‌ను మృత్యువు వెంటాడింది. గుండెపోటు, వడదెబ్బ, పని ఒత్తిడి వంటివి మృతికి కారణంగా తెలుస్తోంది. కిశోర్ మృతి సమాచారం అందిన వెంటనే రిలీవింగ్ ఆర్డర్ ఆగమేఘాలపై సిద్ధం చేయడం గమనార్హం. ఈ విషయమై ప్రశ్నించగా మర్చిపోయి వెళ్లిపోయాడని అధికారులు చెప్పడం గమనార్హం. కిశోర్ తండ్రి మృతి చెందగా, తల్లి ఒడిశాలో నివాసముంటున్నారు. కిశోర్ శ్రీకాకుళం పట్టణంలో గదిని అద్దెకి తీసుకుని నివస్తున్నాడు. మృతి విషయమై సీనియర్ అసిస్టెంట్ అజయ్ వద్ద ప్రస్తావించగా రిలీవ్ ఆర్డర్ మర్చిపోయి వెళ్లాడని చెప్పారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి స్పందిస్తూ కిశోర్ స్వతహాగానే వెళ్తానని చెప్పడంతో పంపించామని, తాము ఒత్తిడి చేయలేదని స్పష్టం చేశారు.

రెడ్‌క్రాస్.. సేవలకు కేరాఫ్ అడ్రస్..!

- వందకు పైగా రక్తదాన శిబిరాలు
- ఏడాదిలో 4,815 మందికి రక్తం అందజేత

నేడు రెడ్‌క్రాస్ దినోత్సవం



ప్రథమ చికిత్సలో శిక్షణ (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఎన్నో రకాల సేవలను ప్రజలకు అందిస్తోంది. అత్యవసర పరిస్థితులలో రక్తం అవసరమయ్యేవారికి రక్తాన్ని అందిస్తూ వారి ప్రాణాలు కాపాడడంలో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. జిల్లాలో ఈ ఏడాది వివిధ ప్రాంతాల్లో రక్తదాతల సహకారంతో ఏర్పాటు చేసిన 100 రక్తదాన శిబిరాల ద్వారా సుమారుగా 5,201 యునిట్ల రక్తాన్ని సేకరించారు. దాని నుంచి 4,815 మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సకాలంలో రక్తం అందించి ప్రాణాలు కాపాడారు. అలాగే మెడిసిన్ బ్యాంకు, ఐ డొనేషన్, ఫిజియోథెరపీ కేంద్రం, అనాథ పిల్లల సంరక్షణ, ఆటిజం కేంద్రం, ప్రథమ చికిత్స శిక్షణలు తదితర ఎన్నో సేవలు అందిస్తూ సేవలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఈనెల 8న రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీడ్యునాంట్ జన్మదినం సందర్భంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఖర్చు తగ్గించేందుకు ప్రయత్నం



తలసేమియా రోగులు తమ వద్ద రక్తం తీసుకెళ్లి బయట ఎక్కించుకోవడం జరుగుతోంది. దీనివలన వారికి ఖర్చులు అధికమవుతాయని ఆలోచించి, రక్తం ఎక్కించే కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. ఒక వైద్యుడి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది. రోగులకు పౌష్టికాహారం కూడా అందజేస్తాం.
– జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ చైర్మన్

తలసేమియా రోగుల కోసం...

రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తలసేమియా రోగులకు రక్తం ఎక్కించే కేంద్రాన్ని రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఆర్అండ్‌బీ బంగ్లా వద్దనున్న అనురాగ నిలయం పైన ఉన్న సీవీ నాగజ్యోతి ఆనంద నిలయం మీటింగ్ హాల్‌లో ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నారు. ఒకేసారి ఆరుగురు రోగులకు రక్తం ఎక్కించేందుకు కోసం బెడ్స్ ఏర్పాటు చేశారు. వీరికి రక్తం ఎక్కించేందుకు ఒక వైద్యుడిని కూడా నియమించారు. తమ వద్దకు వచ్చే తలసేమియా రోగులకు రక్తం అందించడమే కాకుండా, రక్తం ఎక్కించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కేంద్రంలో ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. అక్కడ జరిగే కార్యక్రమాల కోసం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు వివరించారు.